


డిఎల్ఎస్ఎ కార్యదర్శిగా కృష్ణప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం జిల్లా గాజువాక అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు మేరకు విజయనగరం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా న్యాయ సేవా అధికార సిబ్బంది స్వాగతం పలికినారు.



కృష్ణప్రసాద్‌కు పూలమొక్క అందజేస్తున్న సిబ్బంది



మద్యం అమ్మకాలను పెంచే దిశగా కూటమి సర్కారు అడుగులు ముందుకు వేస్తోంది. మద్యాన్ని ఆదాయ వనరుగా భావించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నూతన మద్యం పాలసీని తీసుకు వచ్చి మద్యం షాపులను ప్రైవేట్ వ్యాపారులకు అప్పగించారు. వైసిపి హయాంలో ప్రభుత్వం మద్యం షాపులు నిర్వహిస్తే టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ మద్యం షాపులను రద్దు చేసి ప్రైవేట్ మద్యం షాపులను ఏర్పాటు చేశారు. ప్రైవేట్ వ్యాపారులకు మద్యం షాపులు కేటాయించడంతో కోట్లలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. మద్యంపై ఇంకా ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తూ పర్మిట్ రూములకు అనుమతులు ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తుంది.

తాగడానికీ ఏర్పాట్లు

- వైన్‌షాపులకు అనుసంధానంగా పర్మిట్ రూములు
- మద్యం అమ్మకాలు పెంచేందుకు టిడిపి కూటమి సర్కారు ప్రయత్నాలు
- పర్మిట్ రూములతో బార్‌షాపులపై ప్రభావం
- జిల్లా వ్యాప్తంగా 169 షాపులకు అనుమతులు!

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా వ్యాప్తంగా 169 మద్యం దుకాణాలు ఉన్నాయి. ప్రభుత్వం మొదటి విడతలో 153 షాపులకు టెండర్లు వేసి ఖరారు చేయగా రెండో విడతలో కల్లుగీత కార్మికులకు మరో 16 షాపులను టెండర్ల ద్వారా కేటాయించారు. తద్వారా ప్రభుత్వానికి రూ.102కోట్లు వరకు ఆదాయం వచ్చింది. లైసెన్స్ ఫీజు ద్వారా మొదటి సంవత్సరం ఒక్కొక్క షాపునకు రూ.65లక్షలు ఫీజు ద్వారా 109.85 కోట్లు ఆదాయం వస్తుంది. రెండో ఏడాది ఒక్కో షాపునకు రూ.72లక్షలు చొప్పున రూ.121.68కోట్లు ఆదాయం రానుంది. మద్యం షాపుల పర్మిట్ రూములకు అనుమతి ఇస్తే ఒక్కో షాపునకు ఏడాదికి రూ.5లక్షల వరకు ఫీజు వసూలు చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో జిల్లా నుంచి ప్రభుత్వానికి రూ.3.38కోట్లు ఆదాయం అదనంగా రానుంది.

పర్మిట్ రూములతో బార్ షాపులపై ప్రభావం

మద్యం షాపులకు పర్మిట్ రూములు ఏర్పాటు చేస్తే బార్ షాపుల అమ్మకాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. 2022లో వైసిపి ప్రభుత్వం బార్ పాలసీని తీసుకు వచ్చింది. వైన్ షాపులు కంటే బార్ షాపులకు ఎక్కువ ధరకు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. దీంతో వాటిలో మద్యం ధరలు కూడా ఎక్కువే. దీంతో బార్ షాపులలో మద్యం కొనుగోలు చేసేందుకు మందుబాబులు ఆసక్తి చూపడం లేదు. వైన్ షాపులలో లభ్యమయ్యే చీప్ లిక్కర్ బాటిల్‌పై ఎంఆర్‌పి రూ.99 ఉంటే బార్ షాపుల్లో రూ.102కు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. కింగ్ ఫిషర్ బీర్ వైన్ షాపులలో రూ.200కే దొరికితే బార్ షాప్‌కు ప్రభుత్వం రూ.204కు సరఫరా చేస్తుంది. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ధరకు లాభం, సర్వీస్ చార్జీ వేసుకుని బార్ వ్యాపారులు అమ్మడంతో కొనుగోలు చేసేందుకు మందుబాబులు ఆసక్తి చూపడం లేదు. వైన్ షాపులకు పర్మిట్ రూములు ఇస్తే బార్ షాపులలో అమ్మకాలు పూర్తిగా తగ్గిపోతాయని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు.

మద్యం అమ్మకాలు పెంచేందుకు ప్రయత్నం

మద్యం అమ్మకాలు పెంచేందుకే పర్మిట్ రూముల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం పర్మిట్ రూములకు అనుమతులు ఇచ్చింది. 2019లో వైసిపి అధికారంలోకి రావడంతో ప్రైవేట్ మద్యం షాపులను రద్దు చేసి ప్రభుత్వ మద్యం షాపులను ఏర్పాటు చేసింది. కూటమి సర్కార్ వచ్చిన తరువాత ప్రభుత్వ మద్యం షాపులను రద్దు చేసి ప్రైవేట్ మద్యం షాపులను ఏర్పాటు చేసింది. పర్మిట్ రూములకు అనుమతి ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

2 బార్లు మూత

జిల్లాలో 26 బార్ షాపులు ఉన్నాయి. వీటిలో తగినంత వ్యాపారం అవ్వకపోవడంతో రెండు బార్ షాపులు మూత పడ్డాయి. వైన్ షాపులకు పర్మిట్ రూములు ఇస్తే బార్ షాపులన్నీ పూర్తిగా మూత పడే అవకాశం ఉంది. బార్‌షాపు లైసెన్స్ ఫీజు కింద ప్రభుత్వానికి ఏడాదికి రూ.55 లక్షలు చెల్లిస్తున్నారు. బిజినెస్ అవ్వకపోవడంతో రాజాంలో మూడు షాపులకు ఒక షాపు మూతపడింది. ఎస్.కోటలో ఉన్న ఒక్క బార్‌షాపు కూడా మూత పడింది. పర్మిట్ రూములకు అనుమతులు ఇస్తే ఆయా మిగతా వాటిపైనా తీవ్ర ప్రభావం పడనుంది.

జిందాల్ అక్రమ లాకౌట్ ఎత్తేయాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిందాల్ అక్రమ లాకౌట్‌ను ఎత్తివేసి పరిశ్రమను తెరిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు పి.శంకర్రావు, కె.సురేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్తవలస మండలం అప్పన్నపాలెం దగ్గర ఉన్న జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ కర్మగారాన్ని యాజమాన్యం హఠాత్తుగా లాకౌట్ ప్రకటించి కార్మికులను రోడ్డున పడేయడం అన్యాయమని తెలిపారు. గత సంవత్సరం కూడా ఇదే పద్ధతిలో రా మెటీరియల్ లేదని కారణం చూపించి రెండు నెలలకు పైగా కంపెనీని మూసివేశారని, ఇప్పుడు కూడా అదే పద్ధతిలో యాజమాన్యం వ్యవహరిస్తుందని అన్నారు.కంపెనీని నమ్ముకుని 320 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారని, వీరందరినీ అర్ధాంతరంగా ముడి సరుకు లేదని కారణం చూపించి ప్రభుత్వం అనుమతి కోరకుండా, కార్మిక సంఘాలకు తెలియజేయకుండా అక్రమంగా లాకౌట్ చేసి కార్మికులను ఇబ్బందికి గురిచేయడం అన్యాయయని తెలిపారు.ంటనే యాజమాన్యం స్పందించి రా మెటీరియల్ తెప్పించి కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే జెఎసిగా ఏర్పడి ఆందోళనను ఉధృతం చేస్తామని తెలిపారు.


'జిందాల్' అక్రమ లాకౌట్ వార్త మెయిన్‌లో

కాంట్రాక్టర్ల ప్రయోజనానికే బైపాస్

- కొంతమంది భూముల ధరలు పెంచేందుకు ప్రయత్నం
- రైతుల భూములకు రక్షణ కల్పించాలి
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఎపి రైతుసంఘం వినతులు

ప్రజాశక్తి-కొత్తవలస

శృంగవరపుకోటకు బైపాస్ అవసరం లేదని, కాంట్రాక్టర్ల ప్రయోజనానికే ఆ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని ఎపి రైతుసంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు 516బి జాతీయ రహదారికి సంబంధించి బైపాస్‌లో భూములు కోల్పోతున్న కొత్తవలస, శృంగవరపుకోట మండలాల రైతులు ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుకు శుక్రవారం వినతులు అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు, పోరాట కమిటీ కన్వీనర్ మద్దిల రమణ, కో-కన్వీనర్ గొంప కృష్ణమూర్తి మాట్లాడుతూ బైపాస్ ఆవశ్యకత శృంగవరపుకోటకైతే అవసరం లేదని స్పష్టంచేశారు. కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం, కేంద్రమంత్రుల భూముల పక్క నుంచి బైపాస్ తీసుకెళ్లి, భూమికి రేటు పెంచడం కోసం పేద రైతుల పొట్ట కొట్టడం సరికాదని చెప్పారు. ప్రస్తుతం విశాఖ-అరకు రహదారిని విస్తరిస్తే సరిపోతుందని, భూమి కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. మరోవైపు ప్రస్తుత మార్కెట్ విలువకు, ప్రభుత్వ ధరకు ఐదు నుంచి పది రెట్ల వ్యత్యాసం ఉందన్నారు. రైతుల భూములను సేకరిస్తే, మార్కెట్ ధరను పరిగణనలోకి తీసుకొని 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. బైపాస్ వెళ్లే గ్రామాలు శృంగవరపుకోట, కొత్తవలస పట్టణాలకు ఆనుకొని ఉన్నందున గజాల్లో అమ్మకాలు సాగుతున్నాయని, ప్రభుత్వ పరిహారం కూడా గజాలు చొప్పున నిర్ణయించి ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్.ముత్యాలు, ఎన్.స్వామి నాయుడు, కె.సూరజ్, కె.నాయుడు, వి.జైబాబు, పి.రమణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే లలితకుమారికి వినతి అందిస్తున్న రైతుసంఘం, పోరాట కమిటీ నాయకులు

వర్షం.. రైతుల్లో హర్షం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని శుక్రవారం సాయంత్రం విస్తారంగా వర్షం కురిసింది. ఎండ తీవ్రతతో ఠారెత్తిపోతున్న సమయంలో కురిసిన వర్షంతో ప్రజలకు ఉపశమనం లభించింది. వర్షం వల్ల తొలకరి నువ్వు పంట వేసిన రైతులకు ప్రయోజనం చేకూరింది. మరోవైపు ఎస్.కోట మండలంలో ఈదురుగాలులతో పడినవర్షానికి అరటితోటలు నెలకొరిగాయి.



వేపాడలో కురుస్తున్న వర్షం

గిరిజనుల అభ్యున్నతికి కృషి : డివిజి

ప్రజాశక్తి-విజయనగరం

గిరిజన సమస్యల పరిష్కారానికి కమిషన్ కృషి చేస్తోందని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు తెలిపారు. షెడ్యూల్ ప్రాంతాల్లో భూములపై గిరిజనులకే హక్కులు దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ట్రైబల్ డెవలప్‌మెంట్ మిషన్ సంస్థ ప్రతినిధులు అజయ్ కుమార్, తిరుమల రావు, గోపాల రావు, చందర్ రావు ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు శుక్రవారం విజయనగరంలోని క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో గిరిజన భూ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విస్తృత పర్యటనలు చేస్తూ వారి సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని సమస్యల పరిష్కారానికి కమిషన్ కృషి చేస్తోందని తెలిపారు. గిరిజన ప్రాంతవాసుల సమస్యలు కమిషన్ దృష్టిలో వున్నాయని, సంబంధిత చట్టాలు అమలు చేసేలా ప్రభుత్వాన్ని కమిషన్ కోరుతుందని తెలిపారు.



డివిజి శంకరరావుకు వినతి అందిస్తున్న టిడిఎం ప్రతినిధులు

● ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌లో గందరగోళం

ప్రజాశక్తి-భోగాపురం

ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్ష హాల్ టికెట్ల డౌన్‌లోడ్‌లో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. వెబ్‌సైట్లో ఆన్‌లైన్ చేసేటప్పుడు అప్‌లోడ్ చేసిన ఫొటో కాకుండా అదే విద్యార్థికి సంబంధించిన వేరే ఫొటో వస్తోంది. దీంతో సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నుంచి ఈ రెండు ఫొటోలు ఆ విద్యార్థివేనని ఒక లెటర్ తీసుకొని రావాలంటూ భోగాపురం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ పార్వతి వాట్సాప్ ద్వారా వాయిస్ రికార్డుతో ఒక సందేశాన్ని పంపించారు. ఈ వాయిస్ రికార్డు పరీక్ష రాసే విద్యార్థుల తల్లిదండ్రుల్లో గందరగోళానికి దారితీసింది.

భోగాపురం ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాల కోసం ఇటీవల ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆరో తరగతిలో చేరాలంటే ముందుగా ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుంది. సుమారు 335 మంది విద్యార్థులు వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షను ఈ నెల 21న నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇటీవల హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుంటున్న విద్యార్థుల ఫొటోలు మారిపోయాయి. వెబ్‌సైట్లో ఆన్‌లైన్ చేసేటప్పుడు చేసిన ఫొటో కాకుండా అదే విద్యార్థికి చెందిన వేరే ఫొటోతో హాల్‌టికెట్ డౌన్‌లోడ్ అవుతోంది.

ఆ ఫొటోలు ఉపాధ్యాయులు తీసినవే

ప్రస్తుతం హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసేటప్పుడు వస్తున్న ఫొటోలు సంబంధిత పాఠశాలలో ఉపాధ్యాయులు తీసినవే. కానీ ఆ విషయం ప్రిన్సిపల్‌కు తెలియలేదు. ఎందుకంటే విద్యార్థుల అటెండెన్స్ యాప్‌లో ఉపాధ్యాయులు తీసుకునే సమయంలో మోడల్ స్కూల్‌కు అప్లై చేసుకున్న వారి డేటా ప్రభుత్వం యాప్‌లో ఇచ్చింది. సంబంధిత విద్యార్థి లైవ్ ఫొటోను అప్‌లోడ్ చేయాలని చెప్పడంతో వీరంతా ఫొటోలు తీసి, నమోదు చేశారు. ప్రస్తుతం ఆ ఫొటోలు హాల్ టికెట్లపై వస్తున్నాయి. దీంతో రెండు ఫొటోలు ఒకటేనని, ఇంకా హెచ్ఎం సంతకంతో లెటర్ ఎందుకని విద్యార్థులు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.



మరొకరి ఫొటో వస్తేనే..

హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడు ఒకరి ఫొటోకు బదులు మరొకరు ఫొటో మారితే, ప్రస్తుతం ఉన్న ఫొటో సరిగ్గా కనబడకపోతే, దూరం నుంచి తీసినట్లయితే హాల్‌టికెట్‌పై ఫొటో అంటించి హెచ్ఎం సంతకం తీసుకోవాలి. మా పాఠశాల విద్యార్థి అని లెటర్ తీసుకురావాలి. మిగతా విద్యార్థులు ఎవరూ తీసుకురావాల్సిన అవసరం లేదు.

- పార్వతి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్

సమాచార లోపం

ప్రస్తుతం హాల్ టికెట్‌లో వస్తున్న ఫొటోలతో విద్యార్థి నేరుగా వచ్చి పరీక్ష రాసుకోవచ్చు. ఒకరి ఫొటోకి బదులు ఇంకొకరు ఫొటో వచ్చినప్పుడు హెచ్ఎం సంతకంతో తప్పనిసరిగా లెటర్ తీసుకుని రావాల్సి ఉంటుంది. సమాచారం లోపంతో కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దీన్ని సరిదిద్దుతున్నాం.

- బి.చంద్రమౌళి, ఎంఇఒ-2, భోగాపురం మండలం

ఉత్తరాంధ్ర అభివృద్ధే లక్ష్యం

టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి

ప్రజాశక్తి- చీపురుపల్లి

ఉత్తరాంధ్ర అభివృద్ధే కూటమి ప్రధాన లక్ష్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జునఅన్నారు. శుక్రవారం చీపురుపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాగార్జున మాట్లాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. పరిశ్రమలను తీసుకువచ్చి ఉత్తరాంధ్రను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శ్రమిస్తున్నారని అన్నారు. వైసిపి ప్రభుత్వ దుర్మార్గాల వల్లే రాష్ట్రం నుంచి, ఫ్రాంక్లిన్ టెంపుల్ టన్, లూలు, ఐటి సంస్థలు, ఇతర పరిశ్రమలు వెళ్లిపోయాయని గుర్తు చేశారు. టిడిపి అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే రూ.7 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని తెలిపారు. ఇప్పటికే 48,789 మంది యువతకు ఉద్యోగాలు లభించాయన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ అడుగులు వేస్తుందని తెలిపారు. టిసియస్ కంపెనీకి అతి తక్కువ ధరకే భూములు కేటాయింపు చేశారని వైసిపి నాయకులు గగ్గోలు పెట్టడం ఆశ్చర్యంగా ఉందన్నారు. దేశంలో హైదరాబాదు, బెంగళూరు చెన్నై లాంటి నగరాలతో పోటీ పడాలంటే పారిశ్రామిక వేత్తలుకు కంపెనీ ఏర్పాటుకు కావలసిన మౌలిక సదుపాయాలు, రాయితీలు కల్పించాలన్నారు. టిసియస్ కంపెనీ ఏర్పాటు వలన 12 వేల మంది ఉత్తరాంధ్ర ప్రాంత యువతకు ఉపాధి లభిస్తుందన్నారు.

నేడు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర

- ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణే ప్రధానాంశం
- ఇ-వ్యర్థాలతో భూసారానికి, ప్రజారోగ్యానికి ముప్పు

ప్రజాశక్తి-విజయనగరం

స్వచ్ఛతను ప్రజా భాగస్వామ్యంతో ఒక ప్రజా ఉద్యమంగా రూపొందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నేడు నాలుగో నెలకు చేరింది. ప్రతి నెలా మూడో శనివారం ఒక్కో అంశంపై కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లోకి స్వచ్ఛత సందేశాన్ని తీసుకువెళుతున్న ప్రభుత్వం ఏప్రిల్ నెలకు ఇ-వ్యర్థాల సేకరణ, వాటి పునర్వినియోగం(రీసైక్లింగ్)పై ప్రజల్లో తగిన అవగాహన కలిగించడంతోపాటు వాటిని సరైన రీతిలో నిర్వహిస్తే (రీసైక్లింగ్ చేయనట్లయితే) వాటి వల్ల వాతావరణానికి, మానవాళి ఆరోగ్యానికి వాటిల్లే ముప్పుపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతోంది. సమాచార సాంకేతిక పరిజ్ఞానం కోసం వినియోగించే కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, మొబైల్ ఫోన్లు, వినియోగదారు ఎలక్ట్రానిక్ పరికరాలైన టెలివిజన్‌లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఏసిలు, వీడియో కెమెరాలు, సోలార్ ప్యానల్‌లు తదితర పరికరాలు పనిచేయని పక్షంలో ఇళ్లలో, వాణిజ్య సంస్థల్లో, కార్యాలయాల్లో వాటిని వ్యర్థాలుగా వదిలిపెట్టడం లేదా చెత్తతో పాటు పారబోయడం జరుగుతుంటుంది. వీటితోపాటు ఆసుపత్రులు, లేబోరేటరీల్లో వినియోగించే రేడియోథెరఫీ, కార్డియాలజీ, డయాలసిస్ పరికరాలు కూడా పాడైన తర్వాత వాటిని ఇ-వ్యర్థాలుగానే పరిగణిస్తారు. వీటిని సరైన రీతిలో డిస్పోజ్ చేయడం ముఖ్యం. ఇటీవలి కాలంలో సమాజంలో ఈ తరహా ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలు గణనీయంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో పాడైన, సరైన రీతిలో పనిచేయని పరికరాలను (ఇ-వ్యర్థాలను) తగిన పద్ధతుల్లో నిర్వహణ చేయని పక్షంలో పర్యావరణానికి వీటి ద్వారా(ఇ-వ్యర్థాలు) ముప్పు కలగడం, పుడమిని కలుషితం చేయడంతోపాటు మానవాళికి కూడా వీటివల్ల హాని కలుగుతుందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. ఈ పరికరాల ద్వారా వెలువడే మెర్క్యురీ, లెడ్, కాడ్మియం, బారియం, లిథియం తదితర వాయువులు మానవుల మెదడు, గుండె, కాలేయం, కిడ్నీ తదితర అవయవాలకు ప్రమాదకరంగా మారనున్నాయి.

ఇ-వ్యర్థాలను సరైన రీతిలో రీసైక్లింగ్ చేస్తే వాటి పునర్వినియోగానికి అనువుగా రూపొందించవచ్చు. తద్వారా సహజ వనరుల వినియోగాన్ని పరిమితం చేయడంతో పాటు, వీటిద్వారా లభించే అల్యూమినియం, కాపర్, గోల్డ్, సిల్వర్, ప్లాస్టిక్ తదితర విలువైన ఖనిజాలతో ఆదాయాన్ని పెంచుకోవచ్చు.

ఇ-వ్యర్థాల సేకరణకు జిల్లాలో ప్రత్యేక ఏర్పాట్లు

జిల్లాలో ఇ-వ్యర్థాల సేకరణే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నేతృత్వంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇ-వ్యర్థాల సేకరణ బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తున్నారు. ఆయా గ్రామాలు, పట్టణాల్లో సేకరించిన ఇ-వ్యర్థాలను ప్రభుత్వం అధీకతంగా కేటాయించిన సంస్థలకు అందజేసి వాటిని సరైన రీతిలో రీసైక్లింగ్ చేయడం ద్వారా జిల్లాను శతశాతం ఇ-వ్యర్థాలు లేని జిల్లాగా రూపొందించేందుకు ఈ మూడో శనివారం నుంచే జిల్లా కలెక్టర్ కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ఇప్పటికే ఆయా మండలాలు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పజెప్పారు. వారు తమ మండల, నియోజకవర్గాల్లో పర్యటించి ఇ-వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించడంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు కార్యక్రమాలు చేపడతారు.

దిష్టిబొమ్మలా అర్బన్ హెల్త్ సెంటర్

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

ఎన్నికల ముందు విజయనగరంలోని 45వ డివిజన్ కెఎల్‌పురంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హడావుడిగా ప్రారంభించారు. ఇక నుంచి వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అందరూ భావించారు. కానీ అలా జరగలేదు. ఇప్పటికీ ఆ భవనానికి తాళాలు వేసే ఉన్నాయి. పశువులు గొర్రెలకు నివాస ప్రాంతంగా మారింది. ఎన్నికల స్టంట్ కోసం హడావుడిగా ప్రారంభించారు తప్ప వైద్య సేవలు మాత్రం అందడం లేదు. ఇప్పటికీ విద్యుత్తు సౌకర్యం కల్పించలేదు. నీటి సదుపాయం లేదు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బ్రిడ్జి నిర్మాణం చేస్తుండటంతో అర్బన్ కేంద్రానికి వెళ్లేందుకు దారి కూడా లేకపోవడం గమనార్హం. ఇక్కడ కొండ ప్రాంతం ఉండడంతో భూగర్భజలాలు లేవు. దీంతో దూర ప్రాంతంలో బోరు వేసి, అక్కడి నుంచి పైపులైన్లు వేయాలి. కానీ ఆ పనులు నేటికీ జరగలేదు. మరోవైపు ఎన్నికల సందర్భంగా నగరంలో ధర్మపురి, బాబామెట్ట, వైఎస్‌ఆర్ నగర ప్రాంతాల్లో నిర్మించిన కేంద్రాలు కూడా దిష్టిబొమ్మల్లా ఉన్నాయి. ప్రభుత్వాలు మారాయి తప్ప అర్బన్ హెల్త్ కేంద్రాలు వినియోగంలోకి రాలేదు. ఒక్కొక్క అర్బన్ హెల్త్ కేంద్రం రూ.80 లక్షలతో నిర్మించారు. నిర్మాణాలు పూర్తయినా వినియోగంలోకి తేకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే వినియోగంలోకి తీసుకొచ్చి నగర వాసులుకు వైద్యసేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ భవనం

భవిష్యత్తు మేనేజర్లకు సాధికారత

ప్రజాశక్తి-విజయనగరం

సీతం విద్యాసంస్థలోని మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 'ధ్రువపత్రాల ఆధిక్యం.. ప్రత్యేకత, పురోగతి, విజయం' అనే అంశంపై విశేషమైన ఇంటరాక్టివ్ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి విశాఖపట్నంలోని గాయత్రీ విద్యాపరిషత్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్. రాజని ముఖ్యవక్తగా హాజరయ్యారు. కార్యక్రమంలో నేటి వేగవంతమైన, పోటీతో నిండిన వ్యాపార రంగంలో మేనేజ్మెంట్ విద్యార్థులు విజయవంతమైన కెరీర్‌ను నిర్మించుకోవడంలో ధ్రువపత్రాల పాత్ర ఎంత ముఖ్యమో వివరిస్తూ, విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. శశిభూషణరావు మాట్లాడుతూ ఫలితాల ఆధారంగా ముందుకు సాగే ప్రపంచంలో విద్యార్థులు విజయం సాధించాలంటే ధ్రువపత్రాలు తప్పనిసరి అని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి ఎస్.వరూధిని మాట్లాడారు.

లేబర్ కోడ్ల రద్దుకు సమ్మె

ప్రజాశక్తి-బొబ్బిలి

కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ మే 20న సమ్మె చేపట్టనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు చెప్పారు. స్థానిక శ్రీవేణుగోపాల స్వామి ఆలయం వద్ద శుక్రవారం మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కనీస వేతనాలు చట్టం రద్దు చేసి యాజమాన్యాలు, ప్రభుత్వాలు ఏ సమయంలోనైనా కార్మికులను తొలగించే హక్కు కల్పిస్తూ లేబర్ కోడ్లు తీసుకొచ్చిందని చెప్పారు. కార్మికులకు భద్రతగా ఉన్న ఇఎస్ఐ, పిఎఫ్ లాంటి సౌకర్యాలు, బోనస్, సెలవులు రద్దవుతాయని తెలిపారు. కార్మికులను కట్టు బానిసలుగా మార్చే దుర్మార్గమైన లేబర్ కోడ్లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.



కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేస్తున్న సిబ్బంది

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి-గంట్యాడ

మండలం లోని కొండతామరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ఏర్పాటుచేశారు. గతంలో అక్కడున్న 5ఎంవిఎ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. దీంతో హైదరాబాద్ నుంచి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ తీసుకొచ్చి ఏర్పాటుచేసినట్లు ఎఇ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. దీంతో లోఓల్టేజి సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కొండవెలగాడ, సతివాడ, రామతీర్థం సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్తు అంతరాయం కలుగుతుందని డిఇఇ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక సమస్యలు, చెట్ల తొలగింపు, వ్యవసాయ కనెక్షన్ల పనులపై ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కరెంటు సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు. కొండవెలగాడ, చంద్రంపేట, ఎల్ఎన్‌పురం, తాళ్లపూడిపేట, టెక్కలి, తుమ్మలపేట, చినబూరాడ పేట, పెదబూరాడపేట, పారసాం, గెద్దపేట, మధుపాడ, పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, ఒమ్మి, మాల్యాడ, వెంకన్నపాలెం, గుర్ల మండలం భూపాలపురం, ఆనందపురం గ్రామాల్లో సరఫరా నిలిచిపోతుందని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నగర పంచాయతీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

అందరి సహకారంతో నగర పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానని కమిషనర్ ఎ.తారక్‌నాథ్ తెలిపారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యంగా పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై దృష్టిసారించి సమస్య లేకుండా చూస్తానని తెలిపారు. పన్నులు పూర్తి స్థాయిలో చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు.



మాట్లాడుతున్న కమిషనర్ తారక్‌నాథ్



మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ శ్రీనివాసరావు

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-రాజాం

మండలంలోని కంచరాం గ్రామంలో పైలవానిచెరువులో శుక్రవారం చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ శ్రీనివాసరావు పరిశీలించారు. 210 మంది కూలీల మస్తర్లను పరిశీలించారు. వేతనదారులు పనికి వచ్చేటప్పుడు తగిన పనిముట్లు తీసుకుని వెళ్లాలని సూచించారు. రోజు కూలి రూ.307 గిట్టుబాటు అయ్యేలా చూడాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు.

సీజ్ చేసిన వాహనాలకు జరిమానా

ప్రజాశక్తి-బొండపల్లి

సీజ్ చేసిన వాహనాలకు అధికారులు భారీగా జరిమానాలు విధించారు. వెదురువాడ రెవెన్యూ పరిధిలో పాడిపేట సమీపంలో డి-పట్టా భూమిలో యథేచ్ఛగా కంకర అక్రమ తవ్వకాలు చేపడుతున్న జెసిబి, మూడు ట్రాక్టర్లను గురువారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. వాల్టా చట్టం ప్రకారం రూ.25 వేలు అపరాధ రుసుం విధించినట్లు తహశీల్దార్ ది,రాజేశ్వరరావు తెలిపారు.

నేడు రేగిడి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-రేగిడి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపిపి ధార అప్పలనరసమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శ్యామలకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో రావాలని సూచించారు. సభ్యులు కాని వారు సమావేశాలకు రావద్దని కోరారు.

జనసేన ఆర్థిక సాయం

ప్రజాశక్తి-భోగాపురం

ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రావాడ గ్రామానికి చెందిన మూడు కుటుంబాలకు జనసేన నాయకులు శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు చొప్పున నగదు, బియ్యం ప్యాకెట్లు అందించారు. జనసేన నాయకులు, లెండి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చొప్పా కిరణ్ కుమార్ తన కళాశాలలో చదివిన ఇప్పిలి దేవికి మరో రూ.10 వేలను తనవంతుగా అందించారు. నాయకులు వందనాల రమణ, కొండపు రాధాకృష్ణారెడ్డి, బొల్లు త్రినాథ్, లంక సత్యనారాయణ, కొయ్య రాంబాబు, దాలి రెడ్డి, షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేన నాయకులు

తీరు మారని రెవెన్యూ

- ఎసిబికి దొరికిన వారంతా ఆ శాఖ నుంచే
- ముగ్గురు విఆర్‌ఒలు, జూనియర్ అసిస్టెంట్ పట్టుబడిన వైనం



డెంకాడ తహశీల్దార్ కార్యాలయం



ఎసిబి దాడిలో పట్టుబడిన విఆర్‌ఒ శ్రీనివాసరావు(ఫైల్)

ప్రజాశక్తి -డెంకాడ

విశాఖపట్నం, విజయనగరం సమీపంలో డెంకాడ మండలం ఉంది. మండలానికి అన్ని వైపులా జాతీయ రహదారులు, సమీపంలోనే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం చేపట్టడంతో మండలంలో భూమి ధరలకు రెక్కలొచ్చాయి. ఈ మండలానికి బదిలీపై రావడానికి అధికారులు ఎంతో ఆసక్తి చూపిస్తుంటారు. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల ద్వారా సిఫార్సులతో పోటీపడి డెంకాడ మండలానికి బదిలీపై వస్తున్నారు. భూముల రేట్లు అమాంతంగా పెరగడంతో ఇదే అదునుగా కొందరు రెవెన్యూ అధికారుల పనితీరులో కూడా మార్పు వచ్చింది. దొరికినకాడికి దోచుకోవడంలో మునిగి తేలుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకుల నుంచి ఎక్కువ మొత్తంలో రెవెన్యూ అధికారులు వసూలు చేస్తూ, వారి పనులు త్వరగా పూర్తి చేస్తున్నారు. ఆ విధంగానే రైతుల వద్ద కూడా డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే రైతుల రెవెన్యూ పనులేవీ చేయడం లేదు. రైతులు లంచాలు ఇవ్వడానికి వెనకడుగు వేస్తే, వారిని రోజులు, నెలలు కాదు.. ఏళ్ల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పి పంపుతున్నారు.

> మండలంలో ఎసిబి దాడుల్లో ఒకరు కాదు, ఇద్దరు కాదు.. ఏకంగా నలుగురు పట్టుబడ్డారు. కార్యాలయంలో, బయట, నడిరోడ్డుపైనే అడ్డంగా ఎసిబి అధికారులకు దొరికిపోయారు. ఎసిబికి దొరికిన వారంతా రెవెన్యూ శాఖ నుంచే కావడం గమనార్హం. దీన్నిబట్టి రెవెన్యూ శాఖలో అక్రమ వసూళ్లు ఏ స్థాయిలో సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. వరుసగా ఒకే కార్యాలయంలో ఎసిబి అధికారులకు లంచం తీసుకుంటుండగా పట్టుబడుతున్నా.. రెవెన్యూలో అవినీతి జాడ్యం మాత్రం ఆగడం లేదు.

నలుగురు దొరికినా..

మండలంలో రెవెన్యూ శాఖలో వరుసగా ఎసిబి అధికారులకు లంచం తీసుకుంటుండగా నాలుగు సార్లు పట్టుపడ్డారు. అయినా సరే రెవెన్యూ అధికారుల తీరు మారడం లేదు. తహశీల్దార్ కార్యాలయంలో మొదట జూనియర్ అసిస్టెంట్ లంచం తీసుకుంటుండగా కార్యాలయంలోనే ఎసిబి అధికారులకు పట్టుబడ్డాడు. ఒక మహిళా విఆర్‌ఒ లంచం తీసుకుంటుండగా ఎసిబికి దొరికిపోయింది. మరో విఆర్‌ఒ తహశీల్దార్ కార్యాలయం బయట లంచం తీసుకుంటుండగా రెండుసార్లు దొరికిపోయాడు. తాజాగా నడిరోడ్డుపై విజయనగరంలోని దాసన్నపేట వద్ద రైతు వద్ద నుంచి విఆర్‌ఒ రూ.13 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. తన తండ్రి పేరు మీద ఉన్న 28 సెంట్లు భూమిని తల్లి పేరిట మ్యుటేషన్ చేయడానికి రూ.13 వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబికి దొరికిపోయాడు. ఒకపక్క వరుసగా ఎసిబి దాడుల్లో పట్టుబడుతున్నా రెవెన్యూ అధికారుల పనితీరు మారడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు తీరు మార్చుకొని రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి.రమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి.రమణ

ప్రజాశక్తి-కొత్తవలస

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి.రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ కొత్తవలస తాలూకా యూనిట్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం తాలూకా అధ్యక్షులు జె.వి.ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ సీనియర్ ఎఎన్‌ఎంలకు కౌన్సిలింగ్ నిర్వహించి ఖాళీలను భర్తీ చేయాలన్నారు. సచివాలయ హెల్త్ సెక్రటరీలను గ్రేడ్ -11 ఎఎన్ఎం లుగా ఉద్యోగోన్నతి జాబితా జిల్లాల వారీగా తయారు చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ అసిస్టెంట్ల రీడెప్లాయిమెంట్ రద్దు చేసి, ఆరోగ్య ఉపకేంద్రాల వారీగా ఖాళీలను భర్తీ చేయాలన్నారు. పిఆర్‌సి కమిషన్ చైర్మన్‌ని నియమించాలని, ముందుగా ఐఆర్ ప్రకటించాలని కోరారు. పంచాయతీ సెక్రటరీల జీతాలు వ్యత్యాసాలు సరి చేయాలని, ఐసిడిఎస్ ఉద్యోగులకు ఎఫ్‌టిఎలు అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో తాలూకా సెక్రటరీ శ్రీను, ట్రెజరర్ కృష్ణారావు, భాగ్యలక్ష్మి, స్వర్ణలత, ఈశ్వరరావు, కళావతి, సూర్యారావు, సత్యారావు, వెంకట రమణ, శంకరరావు పాల్గొన్నారు.

పక్షుల విషప్రయోగంపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-రేగిడి

దేవుదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన పక్షుల విషప్రయోగంపై విచారణ చేపట్టాలని సర్పంచ్ కుప్పిలి దుర్గమ్మ , కొంతమంది విద్యార్థులు అధికారులను కోరారు. మత్తు విష పదార్థపు పౌడర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఆ పాఠశాల తరగతి గదుల చుట్టూ, చెట్లపైన చల్లడంతో అవి తిని వందకు పైగా పావురాలు, కాకులు పాఠశాల ఆవరణలో మరణించిన విషయం తెలిసిందే. తరగతి గదిలో కూర్చున్న విద్యార్థులకు స్వల్పంగా మత్తు రావడంతోపాటుగా పక్షులు పైనుంచి రాలిపోవడంతో భయభ్రాంతులకు గురైనట్లు వారు తెలిపారు.

మధ్యాహ్నం భోజనంలో కలిసిందని అనుమానంతో పాఠశాల విద్యార్థులు ఏ ఒక్కరూ భోజనం చేయలేదని తెలిపారు. ఇటీవల దుండగులు మత్తు పదార్థాలు ఇచ్చి అపహరించుకుపోవడం చూశామని, ఒకవేళ జరగరానిది జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. విష ప్రయోగం చేసిన వారిని శిక్షించాలని కోరారు.



పక్షుల విష ప్రయోగంపై విచారణ చేపట్టాలని కోరుతున్న సర్పంచ్, విద్యార్థులు

విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర

ఎమ్మెల్యేలు కోళ్ల, కోండ్రు

ప్రజాశక్తి-లక్కవరపుకోట

మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర చేస్తున్నారని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆరోపించారు. శుక్రవారం లక్కవరపుకోటలోని క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. తిరుమలలో ఆవుల మృతుని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని ప్రయత్నించిన నీచపు పార్టీ వైసిపి అన్నారు. వైసిపి రోజురోజుకూ కరోనా వైరస్ మాదిరిగా మారిపోయిందని విమర్శించారు. ప్రతిరోజూ ఏదో అసత్య ప్రచారాలు చేసి, ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

రాజాం : తిరుమల ప్రశాంతతకు భంగం కలిగించేందుకు వైసిపి నేత భూమన కరుణాకర్ రెడ్డి కుట్రకు తెరలేపుతున్నారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గోవులకు నాసిరకం దాణా, కాలంచెల్లిన మందులు ఇచ్చి మూగజీవాల ప్రాణాలను వైసిపి నేతలు బలితీసుకున్నారని వాపోయారు. గోవులు మరణించిన లెక్కలు బయటకు రాకుండా తొక్కి పెట్టారని, ఈ అరాచకాలకు అప్పటి గోశాల డైరెక్టర్ హరినాథ్ రెడ్డి బాధ్యుడని తెలిపారు. కూటమి ప్రభుత్వంపై నిందలు మోపడం సరికాదని ఆయన అన్నారు.



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

శారద కంపెనీలో మాక్ డ్రిల్

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని కంటకాపల్లి వద్ద గల శారద మెటల్స్ అండ్ ఎల్లాయిస్ లిమిటెడ్ కంపెనీలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సిబ్బంది శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్మికులకు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి బివి ఎస్. రామ్ ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొని అగ్నిమాపక వారోత్సవాల ప్రాధాన్యతను వివరించారు.కార్యక్రమంలో కొత్తవలస ఎస్ఎఫ్ఒ. ఎ. అశోక్ కుమార్, ఎవిపిహెచ్ఆర్ ప్రభాత్ మోహన్, హెచ్ఆర్ డిజిఎం సన్యాసి రావు, సేఫ్టీ హెడ్ సూర్య భాస్కర్, సీనియర్ మేనేజర్ ఫైర్ అండ్ సెక్యూరిటీ పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.



రేగిడి.. సంకిలిలో శిలువతో ర్యాలీ చేపడుతున్న క్రైస్తవులు



వేపాడలో ర్యాలీ చేపడుతున్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

జిల్లాలో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏసుక్రీస్తు తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన ఈ దినాన్ని ఆరాధన దినంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని క్రైస్తవులు తెలిపారు. ఈ సందర్భంగా శిలువలతో ర్యాలీ చేపట్టారు.



పూసపాటిరేగలో చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



బొబ్బిలిలో శిలువతో ర్యాలీ చేపడుతున్న క్రైస్తవులు

స్వచ్ఛాంధ్రలో నేడు ప్రత్యేక కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుండి నగరంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పైడితల్లి అమ్మవారి దేవస్థానం నుండి కోట వరకు స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ర్యాలీలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జోనల్ ఇన్చార్జి బుడితి రాజశేఖర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డిప్యూటీ మేయర్లు ముచ్చు లయా యాదవ్, కోలగట్ల శ్రావణి , వివిధ డివిజన్ల కార్పొరేటర్లు ఈ ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు.

21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఈనెల 21న ఆదర్శ పాఠశాల 6వ తరగతి ప్రవేశ పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపాల్ హెచ్. శైలజ ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న జరగాల్సిన ప్రవేశపరీక్ష ఈస్టర్ పండగ నేపథ్యంలో 21వ తేదీకి వాయిదా పడినట్లు తెలిపారు. విద్యార్థులు హల్ టికెట్‌తో హాజరు కావాలని, పరీక్ష ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.



నవధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నవధాన్యాల సాగు.. నేలతల్లి బాగు

ప్రజాశక్తి-వేపాడ

నవధాన్యాల సాగుతో నేల సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. మండలంలోని చామలాపల్లి పంచాయతీ పోతుబందిపాలెంలో రైతులకు ఐసిఆర్‌పిలు నవధాన్యాల కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. మరోవైపు ప్రతి గ్రామంలో చెరువు పనుల వద్దకు వెళ్లి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు నవధాన్యాలు వల్ల ఉపయోగాలను వివరిస్తున్నారు.



మృతిచెందిన సన్యాసిరావు

గేదె పొడవడంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గంట్యాడ

గేదె పొడవడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని బోనంగి గ్రామంలో చోటుచేసుకుంది. బోనంగి గ్రామానికి చెందిన ఆకలి సన్యాసిరావు(45) గురువారం గేదెలను మేపుతూ తిరిగి కల్లంలో వాటిని కడుతుండగా, గేదె తన తలతో గుండెపై పొడవడంతో సన్యాసిరావు వెనక్కి పడిపోయాడు. దీంతో అతని తలకు గాయమైంది. ఆయనను కుటుంబ సభ్యులు విశాఖ కెజిహెచ్‌కు తరలించగా, శుక్రవారం మృతి చెందాడు.